
రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త






అల్పాహార పథకానిచ్చినందుకు కృతజ్ఞతు చెబుతున్న చిన్నారులు



విద్యార్థుల సంగీత వాయిద్యాన్ని ఆస్వాదిస్తున్న సీఎం రేవంత్

# ఆరుట్లలో సీఎం సందడి

# క్యాంపస్ అంతా కలియతిరిగి..

### తెలంగాణ పబ్లిక్ స్కూల్‌కు ప్రారంభోత్సవం
### ఇన్నోవేషన్ ల్యాబ్, ప్రయోగశాలలతో పాటు మ్యూజిక్, డాన్స్ రూమ్‌లను స్వయంగా సందర్శన
### చిన్నారులతో కలిసి అల్పాహారం
### కాసేపు ఫుట్‌బాల్ ఆడి విద్యార్థులలో జోష్



పాఠశాల విద్యార్థులతో కలిసి అల్పాహారాన్ని రుచి చూస్తున్న రేవంత్

**ఇబ్రహీంపట్నం, జూన్ 17, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామం బుధవారం ఒక సరికొత్త విద్యా విప్లవానికి వేదికైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ఇక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఘనంగా ప్రారంభించారు. కేవలం రిబ్బన్ కట్ చేసి వెళ్ళిపోకుండా, సీఎం రేవంత్ రెడ్డి పాఠశాల ఆవరణలో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు. పాఠశాల ప్రారంభించిన అనంతరం ఆయన క్యాంపస్ అంతా కలియతిరిగారు. స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆ తర్వాత విద్యార్థులతో కలిసి కూర్చొని సరదాగా ముచ్చటిస్తూ బ్రేక్ ఫాస్ట్ చేశారు. పర్యావరణ స్పృహను చాటుతూ స్కూల్ ప్రాంగణంలో ఒక మొక్కను నాటారు. ఆపై పాఠశాలలోని ప్రపంచ స్థాయి సౌకర్యాలైన ప్రీప్రైమరీ విభాగం, డిజిటల్ లైబ్రరీ, ఇన్నోవేషన్ ల్యాబ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రయోగశాలలతో పాటు మ్యూజిక్, డాన్స్ రూమ్‌లను స్వయంగా సందర్శించారు. అక్కడి వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. చివరగా స్కూల్ క్రీడా మైదానానికి చేరుకున్న ముఖ్యమంత్రి, విద్యార్థులతో కలిసి కాసేపు ఫుట్‌బాల్ ఆడి విద్యార్థులలో సరికొత్త జోష్ నింపారు.

**ప్రభుత్వ బడుల్లో నో అడ్మిషన్ బోర్డులు..**

ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావోద్వేగంగా ప్రసంగించారు. ఆరుట్లలో ప్రారంభమైన ఈ తెలంగాణ పబ్లిక్ స్కూల్ కేవలం ఒక గ్రామానికే పరిమితం కాదు.. ఇది రాష్ట్రంలోని 27 లక్షల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల భవిష్యత్తుకు అంకితం అని ఆయన ప్రకటించారు. తెలంగాణ భవిష్యత్తు అద్దాల మేడల్లోనో, రంగుల గోడల్లోనో లేదు.. అది కేవలం తరగతి గదుల్లోనే ఉందనే సంపూర్ణ విశ్వాసంతో తమ ప్రభుత్వం విద్యా రంగంలో సంస్కరణలు చేపడుతోంది అని సీఎం స్పష్టం చేశారు. ఆరుట్ల పబ్లిక్ స్కూల్లో ఇప్పటికే 1,814 మంది విద్యార్థులు చేరడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఒక ప్రభుత్వ పాఠశాలకు ప్రవేశాల పరిమితి దాటిపోయి, నో అడ్మిషన్ బోర్డు పెట్టాల్సిన పరిస్థితి రావడం.. ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో పెరిగిన నమ్మకానికి నిదర్శనమని, ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయులందరినీ ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు.

**ప్రతి నియోజకవర్గానికి ఒక పబ్లిక్ స్కూల్..**

రాష్ట్రంలోని ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లోని మట్టిలోని మాణిక్యాలను వెలికితీయడానికే తాము ప్రభుత్వ బడులను పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా తన గత స్మృతులను గుర్తుచేసుకుంటూ.. మాజీ ప్రధాని పి.వి. నరసింహారావుతో పాటు తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని ఈ స్థాయికి వచ్చామని సీఎం గర్వంగా ప్రకటించారు. విద్యార్థులు కూడా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టాలని పిలుపునిచ్చారు.

**ఒలింపిక్స్ లక్ష్యంగా శిక్షణ**

గతంలో విధ్వంసమైన విద్యావ్యవస్థను వికాసం వైపు నడిపించేందుకు తమ ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తోందని సీఎం వివరించారు. రాబోయే డిసెంబర్ 9న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ భవనాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన ప్రకటించారు. క్రీడారంగంలో ఒలింపిక్స్ లక్ష్యంగా అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందిస్తున్నామని చెప్తూ.. భవిష్యత్తులో ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీతో మన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఆడే అద్భుతమైన అవకాశాన్ని కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఇటువంటి విప్లవాత్మక చర్యలపై కొందరు అనవసర రాజకీయ విమర్శలు చేస్తున్నారని, అలా విమర్శించే వారికి ఆరుట్ల స్కూల్‌ను చూపించాలని సీఎం సూచించారు. ప్రజలు తమ ప్రభుత్వానికి అండగా నిలిస్తే, తెలంగాణను దేశానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.



తెలంగాణ పబ్లిక్ స్కూల్ వ్యాన్‌లో...

# మహిళా రైతుల ఆర్థికాభివృద్ధికి సమష్టి కృషి



మహిళా రైతుల సమావేశంలో మాట్లాడుతున్న భూతల్లి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ చైర్మన్ విజయ

**కేశంపేట, జూన్ 17 ప్రభాతవార్త :** కేశంపేట మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో భూతల్లి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ 2వ వార్షిక సర్వసభ్య సమావేశం, 663 వాటాదారులైన సభ్యులతో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సెర్ప్ రాష్ట్ర స్థాయి అధికారి, ఫార్మ్ డైరెక్టర్ రవీందర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో మహిళా రైతు సంఘాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. చిన్న, సన్నకారు రైతులు సేంద్రియ వ్యవసాయం, విలువ ఆధారిత ఉత్పత్తులు, వ్యాపార కార్యకలాపాలు మరియు మార్కెటింగ్ అవకాశాలను సద్వినియోగం చేసుకుని వార్షిక ఆదాయాన్ని పెంచుకోవాలని మహిళా రైతులకు సలహాలు, సూచనలు అందించారు.

భూతల్లి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ చైర్మన్ కడారి విజయ మాట్లాడుతూ.. గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాల నివేదికను సభ్యులకు వివరించారు. అలాగే రానున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలను చదివి వినిపించారు. ఏపీఎం కవిత మాట్లాడుతూ కొత్త ఎఫ్‌పీవో ఎఫ్‌పీజీ గ్రూపుల ఏర్పాటు, సభ్యత్వాల పెంపు, వాటాదారుల సంఖ్యను విస్తరించడం ద్వారా సంస్థను మరింత బలోపేతం చేయాలని సభ్యులకు సూచించారు.

ఈ సందర్భంగా సంస్థకు నూతన డైరెక్టర్ల బృందాన్ని ఎన్నుకున్నారు. కె. విజయను చైర్మన్‌గా, ఎ. లక్ష్మిలను వైస్ చైర్మన్‌గా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా రైతులు, డీపీఎం నర్సింహులు, ఏపీఎం అనిల్‌కుమార్, సీసీలు మరియు ఇతర అధికారులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశం విజయవంతంగా ముగించారు.

# డంపింగ్ యార్డ్ రాదు

### మహేష్ కుమార్ గౌడ్ స్పష్టీకరణ



జెపి దర్గాను దర్శించుకున్న టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**కొత్తూరు, జూన్ 17, ప్రభాతవార్త:** కొత్తూరు మండలంలోని ప్రముఖ జేపీ దర్గాలో బుధవారం కాంగ్రెస్ నాయకుడు మసూద్ హైమద్ ఏర్పాటు చేసిన నియాజ్ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుసేని హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, సిద్ధాపూర్ గ్రామ పరిసరాల్లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసే ప్రసక్తే లేదని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తారనే ప్రచారం పూర్తిగా నిరాధారమని పేర్కొన్నారు. జేపీ దర్గా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిన ఆధ్యాత్మిక క్షేత్రమని, ఆ ప్రాంత ప్రత్యేకతను దృష్టిలో ఉంచుకుని అక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు ప్రభుత్వం ఎప్పటికీ అనుమతించదని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు.

**బిఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయాల ఫలితమే ఈ వివాదం**

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌డంపింగ్ యార్డ్ అంశంపై అనవసర రాజకీయాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన భూములను టీజీఐసీకి బదిలీ చేసే సమయంలో వాటిని˘జనరల్ యూజ్ కింద నమోదు చేయడం వల్లే ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చిందని వివరించారు.

ఇప్పుడు అదే పార్టీ నేతలు ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం విడ్డూరమని అన్నారు. సిద్ధాపూర్ ప్రజల మనోభావాలను గౌరవిస్తూ అక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాటు జరగదని మరోసారి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎం. శివశంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ కొత్తూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు జాండగూడెం సుదర్శన్ గౌడ్, మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి, నందిగామ కాంగ్రెస్ అధ్యక్షుడు దేపల్లె కుమారస్వామి గౌడ్, పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువత చేతిలోనే దేశ భవిష్యత్తు

### ఓటరుగా నమోదు చేసుకోండి: జిల్లా కలెక్టర్ దీపక్ తివారి పిలుపు




2కె రన్‌లో పాల్గొన్న కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ స్నేహ మెహ్రా

**వికారాబాద్, జూన్ 17, ప్రభాత వార్త :** దేశ భవిష్యత్తు యువత చేతిలోనే ఉందని, 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ యువకుడు బాధ్యతగా ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి పిలుపునిచ్చారు. బుధవారం ఎన్నెపల్లి అంబేద్కర్ చౌరస్తా నుండి ఎన్టీఆర్ చౌరస్తా వరకు జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కె రన్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా పారదర్శకత కోసం ప్రత్యేక సమగ్ర సవరణ సర్ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. జూన్ 25 నుండి జూలై 26 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటి గణన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సర్వే ద్వారా అర్హులైన పౌరులను ఓటర్ల జాబితాలో చేర్చడం, అనర్హులను తొలగించడం జరుగుతుందని, దీనికి ప్రజలు, యువజన సంఘాలు బూత్ స్థాయి అధికారులకు సహకరించాలని కోరారు.

**ప్రజాస్వామ్య బలోపేతానికి ఓటు అవసరం: ఎస్పీ స్నేహ మెహ్రా**

జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రతి ఓటు కీలకమని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతల్లో భాగంగానే ఈ 2కె రన్ నిర్వహించామని తెలిపారు. కొత్తగా ఓటు హక్కు పొందుతున్న యువతను అభినందిస్తూ, ఓటు హక్కుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. వెంకటాచారి, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైని) సచిన్ బస్వరాజ్ గుట్టూరు, జిల్లా యువజన క్రీడల అధికారి సత్తార్, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ నేమత్ అలీ, పోలీస్ అధికారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**భూముల మార్కెట్ ధరల ఆధారంగానే పరిహారం చెల్లించాలి**

జిల్లాలో పవర్ గ్రిడ్ ద్వారా చేపట్టనున్న 765 కెవి విద్యుత్ లైన్ల ఏర్పాటు కోసం సేకరించే భూములకు ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ధరల ప్రకారమే పరిహారాన్ని నిర్ధారించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పవర్ గ్రిడ్ భూసేకరణ అంశంపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పవర్ గ్రిడ్ చేపట్టే పనుల నిమిత్తం భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. భూములను కోల్పోతున్న రైతులతో ముందుగా చర్చల సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు.

# ఈకెవైసికి 30 వరకే గడువు

### ఎల్‌పిజి గ్యాస్ వినియోగదారులు అప్రమత్తం అవ్వాలి
### సివిల్ సప్లయి అధికారి శ్రీనివాస్‌రెడ్డి



అయిల్ కంపెనీల ఎస్ఓలు, ఎల్పిజి డీలర్లు, మేనేజర్లతో మాట్లాడుతున్న డిసిఎస్ఓ శ్రీనివాస్‌రెడ్డి


**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 17, ప్రభాతవార్త :** జిల్లాలో ఉన్న ఎల్‌పిజి గ్యాస్ వినియోగదారులు ఈ నెల 30వ తేదీలోపు ఈకేవైసిని తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని మేడ్చల్ జిల్లా సివిల్ సప్లయ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఎల్‌పిజి వినియోగదారుల ఈకేవైసి విషయంపై డీలర్లతో, మేనేజర్లతో సమీక్ష సమావేశంను ఆయన నిర్వహించారు. ఉప్పల్, బాలానగర్ సంబంధిత ఆయిల్ కంపెనీల సేల్స్ ఆఫీసర్స్, ఎల్‌పిజి డీలర్లు, మేనేజర్లతో ఈ కేవైసి విషయంపై సమీక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్‌పిజి వినియోగదారులు అందరు కూడ ఈకెవైసిని పూర్త చేసుకోవాలని ఈ నెల 30వ తేదీ గడువు ఉన్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గ్యాస్ కనెక్షన్లు 14లక్షల49వేల460 ఉన్నట్లు, అందులో 4లక్షల32వేలు ఎల్‌పిజి వినియోగదారులు ఈకేవైసి పూర్తి చేయాల్సి ఉందని, ఈ నెల 30వ తేదీలోపు ఈకెవైసి పూర్తి చేసుకోవాలని ఆయన సూచించాచు.

# రైతులకు ల్యాండ్ పుల్లింగ్ కింద స్థలాన్ని కేటాయించాలి

### మేడ్చల్ డిసిసి చీఫ్ వజ్రేశ్‌యాదవ్
### కలెక్టరేట్‌లో రాంపల్లి గ్రామ రైతుల ఆందోళన

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 17, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లా పరిధిలోని నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లి గ్రామంలోని సర్వేనెంబరు 388లో పలువురు ఎస్సీ, బిసి రైతులు గత కొన్నేళ్ల నుంచి వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడుపుతున్నారని ల్యాండ్ పుల్లింగ్ కింద స్థలాన్ని ఆ రైతులకు కేటాయించాలని మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్‌తో పాటు ఆ గ్రామ రైతులు పెద్ద ఎత్తున విచ్చేసి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌కు నాగారం డివిజన్ రాంపల్లి గ్రామ రైతులు పెద్ద ఎత్తున చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. డిసిసి అధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్‌తో పాటు వారు కలిసి జిల్లా అదనపు కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు.

కీసర మండలంలోని నాగారం డివిజన్ రాంపల్లి గ్రామ రైతులు సర్వేనెంబరు 388లో 38ఎకరాల భూమిలో సుమారు 270మంది రైతులు వ్యవసాయం చేస్తున్నారని వివరించారు. వరి, కూరగాయలు పంటలు పండిస్తూ రైతులు ఆ భూములు సాగుచేస్తూ జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. ఆ పొలంలో పూర్వం నుంచి మా పెద్దల నుంచి ఇప్పటి వరకు వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడుపుతున్నామన్నారు. రైతులకు న్యాయం చేసి ల్యాండ్ పుల్లింగ్ కింద స్థలాన్ని కేటాయిం చాలని కోరారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న వజ్రేశ్‌యాదవ్

డిసిసి అధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్ రైతుల సమస్యను అదనపు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు వ్యవసాయం చేసుకుంటున్న పొలాలను ప్రభుత్వం దృష్టికి తీసుకపోయి పరిష్కారం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వటం జరిగిందని వారు అన్నారు.

కలెక్టరేట్ వద్ద బాధిత రైతులు పెద్ద ఎత్తున చేరుకుని తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ కోరారు. బాధిత రైతులకు న్యాయం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని డిసిసి అధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్ కోరారు. ప్రభుత్వ దృష్టికి తీసుకవెళతామని రైతులకు ఆయన భరోసా కల్పించారు. దీనిలో డిసిసి అధ్యక్షునితో పాటు జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.



విత్తనాలను అందజేస్తున్న డిసిసి అధ్యక్షులు

## తక్కువ నీటితో అధిక దిగుబడులపై దృష్టి

**పెద్దేముల్, జూన్ 17, ప్రభాతవార్త:** తక్కువ నీటితో అధిక దిగుబడులు ఇచ్చే పంటలు సాగుచేసుకోవాలని వికారాబాద్ డిసిసి అధ్యక్షులు ధారాసింగ్ సూచించారు. బుధవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని రైతువేదికలో కోటపల్లి మార్కెట్ కమిటి చైర్మెన్ అంజయ్య, వైస్‌చైర్మెన్ ఎస్.నారాయన్‌రెడ్డి, సర్పంచ్ డివై నర్సిములు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యాక్షులు శోభారాణి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీన్‌కుమార్ గుప్తా తదితరులతో కలిసి రైతులకు కంది, మినుము విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో నీటి కొరత పరిస్థితులు, ఎల్‌నీనో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో అధిక దిగుబడులు ఇచ్చె పంటలను సాగుచేసుకోవాలని అన్నారు. ముఖ్యంగా టిడిఆర్‌జి-59 కంది రకం ప్రత్యేకతలు, అధిక దిగుబడి, సామర్థ్యం, ఎండలను తట్టుకునే గుణం, రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. సేంద్రియ రైతు రుద్రారం నారాయణ మాట్లాడుతు కంది విత్తనాలను విత్తే ముందు తప్పనిసరిగా విత్తన శుద్ది చేయడం వల్ల మొలక శాతం పెరగడంతో పాటు ప్రారంభ దశలో వచ్చె తెగుళ్ళు, వ్యాధులను నివారించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పవన్ ప్రీతమ్, ఏఈఓలు అపర్ణ, చంద్రకళ, తేజస్విని, కాంగ్రెస్‌పార్టీ గ్రామకమిటి అధ్యక్షుడు డివై నర్సిములు, రైతులు పాల్గొన్నారు.



సొసైటిలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

**పెద్దేముల్, జూన్ 17, ప్రభాతవార్త:** రైతులకు నకిలి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి పవన్‌ప్రీతమ్ హెచ్చరించారు. బుధవారం పెద్దేముల్ మండల కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి పవన్ ప్రీతమ్. మండల తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్, యంపిడిఓ తిరుమలస్వామి సంయుక్తంగా ఎరువుల, విత్తనాలు, పురుగుమందుల విక్రయ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా వ్యవసాయ ఉత్పాదకాల విక్రయాలకు సంబందించిన లైసెన్సులు, స్టాక్ రిజిస్ట్రర్లు, కొనుగోలు, అమ్మకాల రికార్డులు, బిల్లులు, నిల్వ వివరాలతో పాటు ఇతర సంబందిత పత్రాలను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు మాత్రమే డీలర్లు విక్రయించాలని అన్నారు. ఎరువులను నిర్ణిత ధరల కంటె అధిక ధరలకు విక్రయించడం, ఎరువుల బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలను ఉంచితే ఉపేక్షింపబోమని హెచ్చరించారు. రైతులకు తప్పుదోవ పట్టించే చర్యలకు పాల్పడినట్లయితే సంబందిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని అన్నారు. అవసరమైతే లైసెన్సులను రద్దుచేసి, క్రిమినల్ కేసుల నమోదుకు వెనుకాడబోమని హెచ్చరించారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, వ్యవసాయ ఉత్పాదకాల సరఫరాలో పారదర్శకత, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని అన్నారు. ఈ తనిఖీలలో డిప్యుటి తహసీల్దార్ శ్రీనివాసులు, పంచాయతీ అధికారి రతన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.




2కే రన్ ప్రారంభిస్తున్న అధికారులు

## కుల్కచర్లలో ఉత్సాహంగా 2కే రన్

**కుల్కచర్ల, జూన్ 17, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరు ఉదయం, సాయంత్రం వ్యాయామం చేస్తేనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఎస్ఐ రమేష్ కుమార్, ఎంపిడిఓ రామకృష్ణ నాయక్, డిప్యూటి తహసీల్దార్ శేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఒటరు చైతన్య కార్యక్రమంలో భాగంగా తాసిల్దార్ కార్యాలయ సిబ్బంద్ది, అధికారులు ఆధ్వర్యంలో 2కే రన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవింద్ చారి,పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

## కల్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ

**కుల్కచర్ల, జూన్ 17, ప్రభాతవార్త:** పేదింటి కుటుంబాలకు కల్యాణ లక్ష్మి,షాది ముబారక్‌తో ఎంతో మెలుచేకురుతుందని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అడపడుచులకు 46 కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను స్థానిక నాయకులతో కలిసి పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చే పెళ్లి కానుకను తల్లితండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం బండవేల్కిచర్ల గ్రామ సర్పంచ్ మడుగు శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా ప్రజా ప్రతిధుల, అధికారుల ఆధ్వర్యంలో కెక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, మార్కెట్ కమిటి ఛైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, బ్లాక్ బి అధ్యక్షులు భరత్ కుమార్, పార్టీ అధ్యక్షులు గోపాల్ నాయక్, పాంబండ ఆలయ చైర్మన్ మహిపాల్ రెడ్డి, సినియర్ నాయకులు కృష్ణ రెడ్డి, మార్కెట్ కమిటి డైరెక్టర్ భరత్ కుమార్ రెడ్డి, రాంచంద్రయ్య, ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దాడి కేసులో ఆరుగురు నిందితుల అరెస్ట్

**శామీర్‌పేట, జూన్ 17, ప్రభాతవార్త :** తూంకుంట గ్రామంలోని శివాలయం వద్ద జరిగిన దాడి సంఘటనలో ఆరుమంది నిందితులను బుధవారం సాయంత్రం శామీర్‌పేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శామీర్‌పేట మండలంలోని తూంకుంట శివాలయం వద్ద మంగళవారం రాత్రి దాడి ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు.

ఈ దాడి విషయంపై బుధవారం ఫిర్యాదు దారుని మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శామీర్‌పేట పోలీసుల కథనం ప్రకారం తూంకుంట గ్రామానికి చెందిన నిందితులు కత్తి మహేశ్, కత్తి శంకర్, సంకిలి గణేశ్, కత్తి వినయ్, కొలారి సచిన్, పరంది అరుణ్‌కుమార్, మరో నిందితులు నాగులుతో కలిసి మద్యం సేవించి ఫిర్యాదుదారుని ఇంటి వద్దకు గొడవకు దిగటంతో పాటు ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి రాళ్లతో దాడి చేసి తీవ్రగాయాలు కల్గించినట్లు ఆరోపణలు వచ్చినట్లు తెలిపారు. బాధితుని రక్షించేందుకు వచ్చిన కుటుంబ సభ్యులపై కూడ దాడి చేసి బెదిరింపులకు పాల్పడినట్లు దీంతో ఫిర్యాదు దారుని మేరకు వారిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపర్చగా వారికి రిమాండ్ విధించబడినట్లు తెలిపారు. పరారీలో ఉన్న మరో నిందితుడు నాగులును పట్టుకునేందుకు చర్యలు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# వ్యవసాయంలో ఎఐ సేవలు కీలకం

### శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పిలుపు

**పూడూరు, జూన్ 17. ప్రభాతవార్త :** రైతులు భూసార పరీక్షలు చేయించి ఎరువులను వాడితే భూమిపటిష్టంగా ఉంటుందని ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం భారతీయ వరి పరిశోధనా సంస్థ, జిల్లా వ్యవసాయశాఖ సహాకారంతో పూడూరు రైతు వేదికలో ఖేతీబచావో అభియాన్, వరిసాగులో కృత్రిమ మేదస్సు వినియోగం(రైస్-ఐఐఆర్ఆర్ మొబాయిల్ యాప్)పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తల సూచనలను పాటించి పంట మార్పిడి చేస్తే అధిక లాభాలు వచ్చే అవకాశం ఉందన్నారు.

**పూడూరులో పండ్ల మార్కెట్‌కు స్థలం అన్వేషణ**

పూలు, పండ్ల మార్కెట్ ఏర్పాటుకోసం పూడూరు సమీపంలో అసైన్‌మెంట్ భూమిని పరిశీలించాలని తహశీల్దారుకు సూచించారు. ఈ ప్రాంతంలో అక్రమంగా అసైన్‌మెంట్ ల్యాండ్‌ను కబ్జాచేసిన స్థానికేతరులకు నోటీసులు అందజేయాలని ఆదేశించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శైలజ మాట్లాడుతూ వ్యవసాయంలో కృత్రిమ మేదస్సు (ఎఐ) యొక్క ప్రాముఖ్యతను వివరించి, రైస్‌యాప్ ముఖ్యలక్షణాలను ప్రదర్శించారు. ప్రధాన శాస్త్రవేత్త (రోగశాస్త్రం)డాక్టర్ క్రిష్ణవేణి వరిపంటలో తలెత్తే వివిధ సమస్యలను, వాటి నివారణ చర్యల గురించి సమగ్రంగా వివరించి, యాప్‌ను ప్రదర్శించారు. ప్రధాన శాస్త్రవేత్త (సాయిల్ సైన్స్) డాక్టర్ బ్రజేంద్ర నేల వ్యవసాయానికి పునాది అని, పంటలకు పోషకాలు, నీరు, బౌతిక మద్దత్తు అందిసుందన్నారు. నేల ఆరోగ్య ప్రాముఖ్యతను వివరించారు. డాక్టర్ పాపారావు శాస్త్రవేత్త మాట్లాడుతూ పోషక విలువలు కలిగిఉన్న బయోఫోర్టిఫైడ్ వరిరకాల గురించి తెలియజేశారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాజరత్నం మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అమలు పరుస్తున్న ప్రభుత్వ పథకాలు, ఫర్టిలైజర్ యాప్‌గురించి వివరించారు. పూడూరు పిఎసిఎస్ మాజీ చైర్మన్ పట్లోళ్ల రఘునాథరెడ్డి, మురళీధర్‌రెడ్డి అద్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆత్మచైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు బి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులు, స్థానిక సర్పంచ్ ఖిజర్‌పాష, తహశీల్దారు విజయ్ కుమార్, ఎంపిడిఓ పాండు, ఎఓ లావణ్య, ఉప సర్పంచ్ రాందాస్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శులు పెంటయ్య, అజీపటేల్, ఎస్ శ్రీనివాస్, నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అనంతరాములు, పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.



వరి వంగడాల కిట్లను రైతులకు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే

# అంటువ్యాధులు ప్రబలకుండా అప్రమత్తం

### వైద్యశాఖ అధికారులకు కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశం

**పూడూరు, జూన్ 17. ప్రభాతవార్త :** వర్షాకాలం సందర్భంగా ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్‌తివారీ పేర్కొన్నారు. బుధవారం పూడూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి,మందుల స్టోర్‌రూం, ఆయుష్ క్లినిక్, వార్డును, అక్కడే నిర్వహిస్తున్న కంటి స్రీనింగ్ పరీక్షలను పరిశీలించి, రోగులకు కళ్ల అద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రతిరోజు డాక్టర్,సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించాలన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమైనందున రాష్ట్రీయ బాలస్వాస్థ కార్యక్రమం క్రింద అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు స్కీనింగ్ పరీక్షలు నిర్వహించాలని, అవసరమైన విద్యార్థులకు రక్తహీనత నివారణ మాత్రలు అందజేయాలన్నారు. చిన్నవ్యాధుల చికిత్సలు, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలని వివరించారు. వర్షాకాలంలో పాముకాటు వంటి సంఘటనలు జరిగే అవకాశం ఉంటుందని, యాంటి స్నేక్ వీనంతోపాటు, కుక్కకాటు వ్యాక్సిన్ అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు అందిస్తున్న సేవలగురించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు.గత సంవత్సర కాలంగా మాతృ, శిశు మరణాలు ఏమైనా జరిగాయా? అని అడిగితెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 24గంటలు పనిచేసే ఆసుపత్రిగా ప్రభుత్వం నుండి అనుమతులు పొందడానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. అనంతరం కెజిబివి, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు మెను ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సంబందిత అధికారులకు సూచించారు. పారిశుధ్య పనులతోపాటు వంటశాలలు, స్నానాల గదులు, టాయిలెట్లు, పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యాబోధన ఉండాలన్నారు.

అనంతరం పిఎసిఎసి కార్యాలయాన్ని సందర్శించి యూరియా లభ్యతగురించి అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా యూరియా అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం మండల తహశీల్దారు కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, డిఎంహెచ్ఓ కె సుధాకర్‌లాల్, డిస్యూటి డిఎంహెచ్ఓ డాక్టర్ జ్యోతి, తహశీల్దారు విజయ్‌కుమార్, ఎంపిడిఓ పాండు, ఎంఇఓ సాయిరెడ్డి తదితరులు ఉన్నారు.



ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులను పరామర్శిస్తున్న కలెక్టర్ తదితరులు

# రూ.2.16 కోట్లతో శ్రీవారి ఆలయ పునర్నిర్మాణం

**దౌల్తాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండల ప్రజల చిరకాల ఆకాంక్ష, ఎన్నో సంవత్సరాల కల ఎట్టకేలకు సాకారమైంది. మండల కేంద్రంలోని చెరువు కట్ట వద్ద వెలిసిన శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయ నూతన పునర్నిర్మాణ పనులకు బుధవారం ఉదయం 7:15 గంటలకు అత్యంత వైభవంగా భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆశీస్సులు, కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, సీఎం సోదరులు ఎనుముల తిరుపతి రెడ్డి విశేష సహకారం, అలాగే స్థానిక మండల నాయకుల పట్టుదలతో ఈ ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం రూ.2 కోట్ల 16 లక్షల భారీ నిధులను మంజూరు చేసింది. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో భూమి పూజ మహోత్సవాన్ని వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు.

**సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గొప్ప కట్టడం:తిరుపతి రెడ్డి**

ఈ చారిత్రాత్మక పుణ్యకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం సోదరులు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎనుముల తిరుపతి రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దౌల్తాబాద్ ప్రాంత ప్రజల దశాబ్దాల కల నేడు నెరవేరడం ఎంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు. ఈ ఆలయం కేవలం ఒక ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా, రాబోయే తరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచి, వెయ్యి సంవత్సరాల చరిత్రకు సాక్ష్యంగా నిలిచే గొప్ప కట్టడంగా అవతరించనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**ఆధ్యాత్మిక శోభతో విలసిల్లిన చెరువు కట్ట..**

ఈ మహోత్సవ కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు, అధికారులు, వివిధ హోదాల్లోని ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, దౌల్తాబాద్ మండల ప్రజలు పెద్ద సంఖ్యలో కుటుంబ సమేతంగా తరలివచ్చారు. భక్తులంతా స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తుల కోలాహలం, గోవింద నామస్మరణలతో దౌల్తాబాద్ చెరువు కట్ట పరిసర ప్రాంతాలన్నీ ఆధ్యాత్మిక శోభతో సంతరించుకున్నాయి.

**ఆకట్టుకుంటున్న ఆలయ నూతన నమూనా**

దౌల్తాబాద్ మండల కేంద్రంలోని చెరువు కట్ట వద్ద సుమారు రూ.2.16 కోట్ల ప్రభుత్వ నిధులతో పునర్నిర్మించబోయే శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి నూతన ఆలయ నమూనా (మోడల్) చిత్రం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఎంతో అద్భుతమైన శిల్పకళా చాతుర్యంతో, భవిష్యత్ తరాలు గర్వపడేలా ఈ ఆలయ డిజైన్‌ను రూపొందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతోనే ఈ నిధులు సాధ్యమయ్యాయని, ఈ అద్భుత ఆధ్యాత్మిక కట్టడం ఈ ప్రాంతానికే మకుటాయమానంగా నిలవబోతుందని మండల నాయకులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వేంకటేశ్వర స్వామి ఆలయ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి ఎనుముల తిరుపతి రెడ్డి



రహదారిని పరిశీలిస్తున్న బిజెపి నాయకులు

## రహదారి పనులు వెంటనే పూర్తి చేయాలి

**జవహర్‌నగర్, జూన్ 17. ప్రభాతవార్త :** బాలాజీ నగర్ నుండి చెన్నాపురం వరకు కొనసాగుతున్న రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేసి వెంటనే పూర్తి చేయాలని స్థానిక నాయకులు డిమాండ్ చేశారు. రోడ్డు పనులు అత్యంత నెమ్మదిగా సాగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అసంపూర్తిగా ఉన్న రహదారి కారణంగా ప్రతిరోజూ వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. రహదారిపై గుంతలు, దుమ్ము, ట్రాఫిక్ సమస్యల వల్ల ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. ఈ సందర్భంగా నాయకులు సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్డు పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి రహదారి పనులను పూర్తి చేయాలని కోరారు. లేనిపక్షంలో స్థానిక ప్రజలతో కలిసి రహదారిపైనే బహిరంగ నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చంద్రపురి కాలనీ అధ్యక్షుడు కర్లపూడి జోగారావు, జవహర్ నగర్ అధ్యక్షుడు కమలాకర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహేందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ పానుగంటి బాబు, మైపాల్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు కె. దయాకర్ తదితరులు పాల్గొన్నారు.




2కే రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

## ఓటు ప్రజా స్వామ్యానికి పునాది

**తాండూరు, జూన్ 17, ప్రభాతవార్త :** ప్రజాస్వామ్యానికి బలమైన పునాది ఓటు హక్కు అని, మన ఓటు హక్కును పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం తాండూరు పట్టణంలో ఆర్డీఓ అనిత ఆధ్వర్యంలో 2కే రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణంలోని ఇందిరాచౌరస్తా నుంచి సెయింట్ మార్క్స్ స్కూల్ వరకు 2కే రన్ ఉత్సాహంగా కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఓటు హక్కు పరిరక్షణే ప్రజాస్వామ్యానికి బలమైన పునాది అన్నారు. ఎస్ఐఆర్ అవగాహన కోసం వేస్తున్న ప్రతి అడుగు ప్రజా చైతన్యానికి నాంది అవుతుందని తెలిపారు. నకిలీ ఓట్లకు తావులేకుండా ప్రజా ప్రతినిధులు, అధికారులు, యువత దృష్టిపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ధారాసింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, ఎస్ఐఆర్ కన్వీనర్ కరణం పురుషోత్తంరావు, పట్టణ అధ్యక్షులు బాతుల నాగరాజు, పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాలు ధార్మిక విలువలకు ప్రతీకలు : మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్

**షాద్‌నగర్, జూన్ 17, ప్రభాతవార్త :** షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ బుధవారం హైదరాబాద్ బేగంబజార్‌లోని ప్రసిద్ధ గణేష్ మందిర్‌తో పాటు భూలక్ష్మమ్మ ఆలయాలను ప్రత్యేకంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుల ఆశీర్వాదాలు తీసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం గోశాలను సందర్శించి గోవులకు ఆహారం అందిస్తూ సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్గనూర్ బసవేశ్వర్ మాట్లాడుతూ, భారతీయ సంస్కృతిలో దేవాలయాలు ఆధ్యాత్మికతకు, ధార్మిక విలువలకు ప్రతీకలన్నారు. భూలక్ష్మమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించానన్నారు.




ఇన్‌ఫోడాట్ సిఇఓతో ఒప్పందం చేసుకుంటున్న రాఘవేందర్‌రెడ్డి

## నిరుద్యోగులకు ఏఐ, ఐటీలో ఉచిత శిక్షణ

**ఆమనగల్లు, జూన్17, ప్రభాతవార్త:** టాస్క్ సీఈఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి నాయకత్వంలోని ఐక్యత ఫౌండేషన్ మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రపంచాన్ని శాసించే స్థితిలో ఉన్న ప్రతిష్టాత్మకమైన ఆర్టిఫిషియేల్ (ఏఐ), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ)లో ప్రావీణ్యం సంపాదించేలా నిరుద్యోగ యువతకు త్వరలో ఉచిత శిక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెళ్ళడించారు. ఈమేరకు అమెరికాలోని ఇన్‌ఫోడాట్ గ్లోబల్ ఇంక్ సంస్థతో ఐక్యత భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నట్లు ఐక్యత ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గాన్ని స్కిల్ హబ్‌గా మార్చేందుకు ఐక్యత ఫౌండేషన్ అహర్నిశలు శ్రమిస్తుందని, ఏఐ, ఐటీ, డాటా అనాలిస్టిక్స్, డిజిటల్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ రంగాలలో స్కిల్ సాధించేలా యువతకు శిక్షణ ఇచ్చి వచ్చే 5ఏళ్ళలో 5వేల ఉద్యోగాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు ఆయన తెలిపారు.త్వరలోనే ఏఐ, ఐటీ విభాగాలలో శిక్షణ ఇచ్చి నిరుద్యోగ యువతకు దేశ, విదేశాలలో ఉద్యోగాలు కల్పిస్తామని సుంకిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.ఇన్‌ఫోడాట్ గ్లోబల్‌ఇంక్ ఫౌండర్ అండ్ సీఈఓ ఎం మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.



సంకటోనిపల్లిలో చదను పనులు పర్యవేక్షిస్తున్న చైర్మన్ పత్య, కమిషనర్

## ముమ్మరంగా మొహరం పండుగ ఏర్పాట్లు

**ఆమనగల్లు, జూన్17, ప్రభాతవార్త:** జూన్ 26న జరిగే మొహరం పండుగకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లి గ్రామంలో ప్రజలు మొహరం పండుగను ప్రతిష్టాత్మకంగా జరుపుకుంటారు. ఈమేరకు పీర్ల సవ్వడితో పాటు గ్రామంలోని ప్రధాన కేంద్రం వద్ద నిర్వహించే వేడుకల స్థల ఏర్పాట్లు పరిశీలించారు. బుధవారం చైర్మన్ పత్యనాయక్, 8వవార్డు కౌన్సిలర్ ఎనుముల రమేశ్, కమిషనర్ రాఘవేందర్‌రెడ్డిలు జరుగుతున్న పనులను పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. మతాలకతీతంగా జరుపుకునే మొహరం పండుగ ఎంతో విశిష్టమైనదని వారు పేర్కొన్నారు. గ్రామపెద్దలు పండుగ కావలసిన ఏర్పాట్లు గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దావధనంజయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డి.మహేశ్, దావ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో అక్షరాలు రాయిస్తున్న సర్పంచ్ శ్రీనునాయక్

## అంగన్‌వాడీలో విద్యతోపాటు పౌష్టికాహారం

**ఆమనగల్లు, జూన్17, ప్రభాతవార్త:** అంగన్‌వాడీ కేంద్రంలో విద్యతోపాటు పౌష్టికాహారం అందుతుందని రాంనుంతల సర్పంచు వద్యావత్ శ్రీనునాయక్ అన్నారు. 3ఏళ్ళ నుండి 6ఏళ్ళ వయస్సు కల్గిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించి వారి ఉన్నతికి దోహదపడాలని సూచించారు. మండల పరిధిలోని రాంనుంతల గ్రామంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనిత, కేంద్రం టీచర్ అలివేలు ఆధ్వర్యంలో అమ్మమాట-అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సర్పంచ్ శ్రీనునాయక్, పంచాయతీ పాలక వర్గం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈమేరకు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సర్పంచు శ్రీనునాయక్ చేత చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈమేరకు శ్రీనునాయక్ మాట్లాడుతూ అంగన్‌వాడీల బలోపేతానికి ప్రభుత్వం ప్రాధాన్యతనివ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రాలలో చిన్నారులకు అనువైన, ఆకట్టుకునే వాతావరణం ఉండేలా అభివృద్ధి పరచాలని కోరారు. ప్లేవే మెథడ్ విద్యనందిస్తే అంగన్‌వాడీ కేంద్రాలకు మరింత స్పందన లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచు రాజేశ్వరిమోహన్, వార్డు సభ్యులు సరిత, ధన్‌రాజ్, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సంతోష, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, ఆశవర్కర్లు, ఆయాలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



అమ్మ మాట- అంగన్‌వాడి బాట కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

## పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోండి

**పెద్దేముల్, జూన్ 17, ప్రభాతవార్త:** గర్భిణిల, బాలింతల, చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో అంగన్‌వాడి కేంద్రాలు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నాయని సర్పంచ్ హేమలత లాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పెద్దేముల్ మండలం గాజీపూర్ అంగన్‌వాడి కేంద్రం-1లో అమ్మ మాట-అంగన్‌వాడి బాట కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ హేమలత మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహరాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అంగన్‌వాడి టీచర్ జహంగీర్ బేగం మాట్లాడుతూ చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి అంగన్‌వాడి కేంద్రాల్లో కల్పిస్తున్న పూర్వ ప్రాథమిక విద్య ఎంతో దోహదపడుతుందని అన్నారు. తల్లులు తమ పిల్లలను క్రమం తప్పకుండా అంగన్‌వాడి కేంద్రాలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి కేంద్రం-2 టీచర్ బీబి, ఆయాలు పాల్గొన్నారు.



బ్రహోత్సవాల్లో పాల్గొన్న బిజెపి నేతలు సుదర్శన్‌రెడ్డి తదితరులు

## చౌదరిగూడలో ఘనంగా బ్రహోత్సవం

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 17, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ చౌదరిగూడలోని శ్రీ వేంకటేశ్వర స్వామి అష్టమ వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా మేడ్చల్ నియోజకవర్గ బిజెపి ఇంఛార్జ్ మాజీ ఎంపీపీ వై. సుదర్శన్‌రెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేదమంత్రోఛ్చారణల మధ్య తీర్థప్రసాదాలు అందజేసి స్వామివారి ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పి.అమరేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, నాయకులు వీరారెడ్డి, మహేందర్‌రెడ్డి, బ్రాహ్మారావు, రాజిరెడ్డి, నారాయణ నాయక్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

### విశ్వకర్మ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మహేంద్రచారి

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 17, ప్రభాతవార్త:** అఖిల భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తరుణి మహేంద్రచారిని నియమించినట్లు ఆ సంఘ సభ్యులు బుధవారం నాడొక ప్రకటనలో తెలిపారు. పోచారం డివిజన్ కొర్రెములకు చెందిన తరుణి మహేంద్రచారి అఖిల భారత విశ్వకర్మ సంఘం అభివృద్ధి కొరకు చేసిన సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించినట్లు తెలిపారు. సమాజ అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర అధ్యక్షుడు నౌండ్ల సంతోశ్‌చారి పేర్కొన్నారు.



మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి

## ఎస్ఐఆర్‌పై దుష్ప్రచారాన్ని నమ్మవద్దు

**షాద్‌నగర్, జూన్ 17, ప్రభాతవార్త :** షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఉమ్మడి కొత్తూరు మండలం, కొత్తూరు మున్సిపాలిటీ, నందిగామ మండలాలకు చెందిన బీఎల్ఏ2లు, ముఖ్య నాయకుల సమావేశం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి అందె బాబయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో అశోక్ గౌడ్, ఐటీ సెల్ నాయకుడు వెంకటరమణ, నరసింహ గౌడ్, ఎస్ఐఆర్ కోకన్వీనర్ వెంకటేష్ యాదవ్, మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి, రణధీర్ గౌడ్, అరవింద్ చారి, రమేష్, నాగరాజు, మాణిక్యం, సుధాకర్ అప్పా, మోహన్ సింగ్ తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ కొత్తగా మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన విధానం కాదని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో కూడా కేంద్ర ఎన్నికల సంఘం అనేకసార్లు ఎస్ఐఆర్ నిర్వహించిందని గుర్తు చేశారు. అక్రమంగా ఓటరు జాబితాల్లో పేర్లు నమోదు చేసుకునే ప్రయత్నాలు జరిగితే వాటికి సంబంధించిన ఆధారాలను ఎన్నికల సంఘం పరిశీలించడం సహజ ప్రక్రియేనని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఓటమి భయంతోనే ఎస్ఐఆర్‌పై నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్ తదితరులు ఎస్ఐఆర్‌పై ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి అందె బాబయ్య మాట్లాడుతూ, షాద్‌నగర్ నియోజకవర్గం హైదరాబాద్‌కు సమీపంలో ఉండటంతో ఓటరు జాబితాల్లో ఎలాంటి దొంగ ఓట్లు, డబుల్ ఓట్లు నమోదు కాకుండా ప్రత్యేకంగా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా, ప్రతి నిజమైన ఓటరు పేరు నమోదు అయ్యేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఐటీ సెల్ నాయకుడు వెంకటరమణ ఎస్ఐఆర్ ప్రక్రియ, ఫారాల సమర్పణ విధానం, బీఎల్ఏల బాధ్యతలు, ఓటరు నమోదు, సవరణలు మరియు ఎన్నికల సంఘం మార్గదర్శకాలపై నాయకులకు సమగ్ర అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు కోసం భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో శివలింగం కుమార్, కుమార్ నాయక్, హేమంత్ నరసింహ, మోహన్ ఉమ్మడి కొత్తూరు, నందిగామ మండలాలకు చెందిన పార్టీ నాయకులు, బీఎల్ఏలు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితాఇంద్రా రెడ్డి

## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

**షాద్‌నగర్, జూన్ 17, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలోని కుంట్ల రాంరెడ్డి గార్డెన్‌లో స్థానిక మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమం, ఓటరు సమగ్ర సర్వే (ఎస్ఐఆర్) అవగాహన శిబిరం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి సబిత ఇంద్రారెడ్డి, పాలమూరు ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మాజీ మంత్రి సబిత ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలులో విఫలమైందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సమస్యలను నిర్ల క్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఓటరు సమగ్ర సర్వే ప్రక్రియపై మాట్లాడుతూ, పార్టీ అభిమానులు, శ్రేయోభిలాషులు, కార్యకర్తల ఓట్లు జాబితాలో సక్రమంగా ఉండేలా బూత్ స్థాయి ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ అంశంపై పార్టీ తరఫున ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అంశంపై స్పందిస్తూ, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ఒత్తిడి తెచ్చిన తర్వాతే ప్రభుత్వం పనులను వేగవంతం చేసిందని పేర్కొన్నారు. పాలమూరు ఎమ్మెల్సీ సురభి వాణిదేవి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో ప్రజల ఆకాంక్షలు నెరవేరాయని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ రంగాల్లో గణనీయమైన అభివృద్ధి జరిగిందని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ మాట్లాడుతూ, షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం విశేష కృషి చేసిందన్నారు. లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ ఆలోచన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని, ఆ ప్రాజెక్టు పనులు నిలిపివేయడానికి కాంగ్రెస్ నాయకుల వైఖరే కారణమని ఆరోపించారు. పార్టీ ఇన్‌చార్జి బైకాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఓటరు సమగ్ర సర్వే కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, పోలింగ్ బూత్ ఏజెంట్లు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, వై. రవీందర్ యాదవ్, రాజా వరప్రసాద్, నరేందర్, ఎంఎస్ నటరాజ్, కడంపల్లి శ్రీనివాస్ గౌడ్, రాంబల్ నాయక్, లక్ష్మీ నరసింహారెడ్డి, మిట్టు నాయక్, ఈట గణేష్, లక్ష్మణ నాయక్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

## షాద్‌నగర్‌లో రూ.కోటితో సిసి రోడ్డు

**షాద్‌నగర్, జూన్ 17, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలో రూ. కోటి వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల నాణ్యత, పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ మాట్లాడుతూ, పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా వివిధ కాలనీలు, ప్రధాన రహదారుల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని, అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ ములుగు మాట్లాడుతూ, ప్రభుత్వం మరియు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణంతో వర్షాకాలంలో నీరు నిల్వ ఉండే సమస్యలు తగ్గడంతో పాటు రాకపోకలు సులభతరం అవుతాయని చెప్పారు. పనులు నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా, నాణ్యతతో పూర్తి చేసేలా అధికారులు నిరంతరం పర్యవేక్షి స్తున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ అఫ్జల్, మున్సిపల్ సిబ్బంది ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లిలో సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

**యాచారం, జూన్ 17, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు అండగా నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోటె శ్రీశైలం అన్నారు. బుధవారం యాచారం మండలం పరిధిలోని మేడిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి సహకారంతో పార్టీ మండల అధ్యక్షుడు మోటె శ్రీశైలం, సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో లిక్కి లక్ష్మమ్మ రూ 36వేలు, మక్కపల్లి రవీందర్ రూ 25వేలు, బెత్త భౌరమ్మ లకు రూ 18వేలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆయంలో నిరుపేదలకు సంక్షేమ పథకాలు అన్ని అర్హులైన వారికి అందుతున్నాయని గుర్తు చేశారు. ఇల్లు లేని నిరు ప్రజలందరికీ ఇందిరమ్మ ఇల్లు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సకాలంలో చెక్కులన్నీ అందజేయడంతో ఎంతోమందికి మేలు జరిగిందని అన్నారు.

పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందే వరకు తమ కృషి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దెంది మధుకర్ రెడ్డి, వార్డు సభ్యులు ఆడాల శ్రీకాంత్, కందుకూరి బాలరాజు, యూత్ అధ్యక్షులు ముంత గణేష్, సీనియర్ నాయకులు విత్ జంగయ్య బండ జంగయ్య కలకొండ మల్లేశం నల్లుల చంద్రయ్య గోదాస్ రవి నలల్ల గణేష జకర్త మధుల జగను బెత్త బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఏ సమస్య ఉన్నా అండగా ఉంటా

**తాండూరు, జూన్ 17, ప్రభాతవార్త :** రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం తాండూరు పట్టణంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉచిత రెడ్‌గ్రామ్ కంది, మినుములు, పెసర్ల విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని, రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందిని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించడం ద్వారా పప్పు ధాన్యాల ఉత్పత్తి పెరుగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, నాణ్యమైన విత్తనాల వినియోగం వల్ల దిగుబడులు పెరిగి రైతులకు అధిక లాభాలు చేకూరుతాయని అన్నారు. ప్రభుత్వం రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలను అందించేందుకు కట్టుబడి



విత్తనాలను అందిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఉందని తెలిపారు.

తాండూరు నియోజకవర్గంలోని రైతుల అభివృద్ధి కోసం ఎల్లప్పుడు కృషి చేస్తానని, రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు, ఆత్మ కమిటీ చైర్మన్ శంకర్‌రెడ్డి, ఏడిఏ అరుణ, మున్సిపల్ కమిషనర్ రాకేష్‌రెడ్డి, డిసిఎంఎస్ ఇంచార్జ్ సలాం, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## 24 గంటలలో మాట నిలబెట్టుకున్న కలెక్టర్

### విద్యార్థులకు క్రీడాపరికరాలు పంపిణీ

**శామీర్‌పేట, జూన్ 17, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదేశాల మేరకు కేశవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మూడుచింతలపల్లి మండల తహసీల్దార్ ఎండి ఇద్రీస్ సూచనలతో మండల డిప్యూటీ తహసీల్దార్ బిక్షం పాల్గొని పాఠశాలలో విద్యార్థులకు క్రికెట్ కిట్లతో పాటు మరి కొన్ని క్రీడా పరికరాలు అందజేశారు. బుధవారం మూడు చింతలపల్లి మండలంలోని కేశవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల తహసీల్దార్ ఎండి ఇద్రీస్ తరపున డిటి బిక్షం పాల్గొని విద్యార్థులకు క్రీడా పరికరాలు కిట్లను అందజేశారు. అయితే మంగళవారం కేశవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ మనుచౌదరిని ఆ పాఠశాల విద్యార్థులు మాకు క్రీడాపరికరాలు క్రికెట్ కిట్లు కావాలని కోరటంతో అందజేస్తామని చెప్పిన సంగతి తెలిసిందే. ఇక మూడుచింతలపల్లి మండల తహసీల్దార్ ఎండి ఇద్రీస్ స్పందించి వెంటనే కేశవరం విద్యార్థులకు క్రికెట్ కిట్లు బ్యాట్‌లు, వికెట్లు, బాల్స్, అదే విధంగ వాలీబాల్, రింగ్‌బాల్స్, పలు క్రీడా సామిగ్రిని అందజేయటంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. క్రీడా సామాగ్రిని అందుకున్న విద్యార్థులు




కలెక్టర్ ఆదేశాలతో క్రికెట్ కిట్లు, క్రీడా పరికరాలు అందజేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ బిక్షం

జిల్లా కలెక్టర్ మనుచౌదరికి వారు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ సందర్భంగా పలువురు మాట్లా డుతూ జిల్లాలో విద్యతో పాటు క్రీడలకు కూడ సమాన ప్రాధా న్యత ఇవ్వటం జరుగుతుందని, విద్యార్థులు సమగ్రంగ శారీ రక, మానసిక, వ్యక్తిత్వ వికాసానికి కట్టుబడి పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, మండల సీనియర్ అసిస్టెంట్ మతిన్, జిపిఓలు శీల, మహేశ, సిబ్బంది సాయి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నాం

**శామీర్‌పేట, జూన్ 17, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విధంగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి నిర్మాణాలు పూర్తి చేస్తుందని, పేదల సొంతింటి కలను నెరవేరుస్తుందని మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్ అన్నారు. బుధవారం మూడు చింతలపల్లి మున్సిపాల్టీ పరిధిలోని పొన్నాల్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ్‌లతో కలిసి మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలు యాదవ్ ప్రారంభించారు. లబ్ధిదారులతో వారు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం చేయించారు. సకాలంలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకున్నందుకు లబ్దిదారులను అభినందించారు. ఈ సందర్భంగా మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తుందని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంకు ప్రభుత్వం 5లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి పేదలకు స్వంత గూడు సౌకర్యం కల్పిస్తున్నారని, డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ సహకారంతో పేదలకు ఇందిరమ్మ



ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం సందర్భంగా లబ్ధిదారులకు నూతన వస్త్రాలు బహూకరిస్తున్న ఎఎంసి చైర్మన్

ఇండ్లు మంజూరు జరిగి నిర్మాణాలు పూర్తి కావస్తున్నట్లు తెలిపారు. లబ్దిదారులు సిఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటారని, పేదలను ఆదుకోవటం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చైర్మన్ నర్సింలుయాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, కౌన్సిలర్లు మౌనికప్రసాద్, కొలాస్ రాజు, మాజీ ఉపసర్పంచు గడ్డం రమేశ్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అజయ్‌లక్ష్మి, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సమస్యల పరిష్కారానికి ఫోకస్

**శామీర్‌పేట, జూన్ 17, ప్రభాతవార్త :** స్థానిక సమస్యలపై పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని కీసర సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్ రామలింగంను మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి కలిసి కోరారు. బుధవారం మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి కీసరలోని కార్యాలయంలో కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రామలింగంను కలిసి మర్యాదపూర్వకంగా సన్మానించారు. మల్కాజ్‌గిరి నగర మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రామలింగంను కలిసి సన్మానించి స్వాగతించారు. ఇటీవలనే డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన మర్మాదపూర్వకంగా కలిసి మున్సిపల్ సర్కిల్ పరిధిలోని ప్రాంతాల్లో ఉన్న సమ్యల పరిష్కారానికి కృషి చేస్తారన్న ఆశాభావంను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు నాయకులు జగదీశ్‌గౌడ్, కత్తి రమేశ్ పాల్గొన్నారు.

## ఎంపిపిఎస్ ప్రీప్రైమరీ స్కూల్ నప్రారంభం

**కొత్తూరు, జూన్ 17, ప్రభాతవార్త:** చిన్నారుల విద్యాభివృద్ధికి పునాది వేస్తూ కొత్తూరు మండల కేంద్రంలో బుధవారం ఎంఎపీఎస్ పాఠశాలలో ప్రీప్రైమరీ విభాగాన్ని ఘనంగా ప్రారంభించారు. ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పుష్పలత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీహెచ్ఎం అంగూర్ నాయక్ పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారుల వ్యక్తిత్వ వికాసానికి ప్రీప్రైమరీ విద్య ఎంతో కీలకమని పేర్కొన్నారు. బాల్యంలోనే విద్యపై ఆసక్తి పెంపొందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందన్నారు. చిన్నారులకు ఆకర్షణీయమైన తరగతి గదులు, విద్యా సామగ్రిని అందుబాటులో ఉంచి తరగతులను ప్రారంభించారు. విద్యను ఆటపాటలతో మేళవిస్తూ బోధించే విధానాలను ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు పాఠశాల చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు

**ఘట్‌కేసర్, జూన్ 17, ప్రభాతవార్త:** రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి లావణ్య అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని ఏదులాబాద్ రైతు వేదిక భవన్‌లో బుధవారం ఎరువుల సమతుల్య వినియోగం, ఏల్‌నినో ప్రభావం, వానాకాలంలో రైతులు వేయాల్సిన పంటలపై అవగాహన సదస్సు జరిగింది.

ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం కారణంగా వరిపంట వేయకుండా రైతులు ఆరు తడి పంటలు వేసుకోవాలని సూచించారు. పంటకు కావాల్సిన ఎరువులను ఫెర్టిలైజర్ యాప్ ద్వారా రైతులు బుక్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు పి. శివకుమార్, డిపెస్, వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆర్. రవితేజ, సంతోశ్, రైతులు పాల్గొన్నారు.



చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

## సమస్యలను పరిష్కరించాలి

**శామీర్‌పేట, జూన్ 17, ప్రభాతవార్త :** మూడుచింతలపల్లి మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిం చాలని కోరుతూ మున్సిపల్ చైర్మన్ జాము రవికి కార్మికులు, సిఐటియు నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. బుధవారం మూడుచింతలపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఉన్నికృష్ణన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు ధర్నా చేసి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ఈఎస్ఐ కార్డు, పిఎఫ్ స్లిప్ ఇవ్వాలని, కనీసవేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని, 8గంటల పనివిధానంను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్‌లో పనిచేస్తున్న కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. మున్సిపల్ కార్మికులకు ఒక పూట డ్యూటీ, వారంతపు సెలవులు అమలు చేయాలని, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు, కనీస వేతనం కూడ కల్పించాలని కోరారు. డబుల్‌బెడ్‌రూమ్స్ ఇండ్లు కూడ ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక నాయకులు సుగుణ, బాలయ్య, కృష్ణ, నవనీత, శ్రీను, జ్యోతి, రాజు, రవి, బిక్షపతి, పాల్గొన్నారు.

## నేడు నారపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్తుకు అంతరాయం

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 17, ప్రభాతవార్త:** ఈనెల 18 వ తేదిన నారపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్తు లైన్ మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సగ్గు హరినాథ్ బుధవారం నాడొక ప్రకటనలో తెలిపారు. ప్రతాప సింగారంలోని 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ లైన్ నిలిపివేత కారణంగా కొర్రెముల, వెంకటాపూర్, తెనుగుగూడెం, మక్త గ్రామం, బాలాజీనగర్, సాదత్ అలీ గూడ, ఓయూ కాలనీలో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని తెలిపారు. నారపల్లి ఇండస్ట్రీయల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండున్నర గంటల నుండి ఐదున్నర గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని దీంతో శివాజీనగర్, వెంకటాద్రి టౌన్‌షిప్, ఎకశిలా నగర్, లక్ష్మీనగర్, సుప్రభాత్ ఫేజ్ 1, చౌదరిగూడలో విద్యుత్ సరఫరాకు అంతరాయక కల్గుతుందని తెలిపారు. విద్యుత్ లైన్ మరమ్మత్తు పనుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతున్నందుకు చింతిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.



తనిఖీలు చేస్తున్న పోలీసులు

## నిషేధిత గుట్కా విక్రయాలపై కొరడా

**శంషాబాద్ జూన్17, ప్రభాతవార్త :** నిషేధిక గుట్కా విక్రయాలపై కఠిన చర్యలు ఉంటాయని సిఐ నరేందర్ రెడ్డి హెచ్చరించారు. శంషాబాద్ మండలంలోని సంఘీగూడ ఎక్స్ రోడ్డు పరిధిలో గల కిరణాషాప్‌లలో శంషాబాద్ పోలీసులు, అండ్ ఈగల్, నార్కొటిక్ డ్రగ్స్ బృందాలు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో షెక్ రహ్మాన్ పాషా, షెక్ సోహెల్ కిరాణా షాప్‌లలో గల నిషేధిత గుట్కా ప్యాకెట్స్‌ని స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సిఐ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... నిషేధిత మత్తు పదార్థాలు, గుట్కా వంటి ఉత్పత్తుల విక్రయాలు లేదా వినియోగంపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని అధికారులు సూచించారు. అక్రమ గుట్కా విక్రయాలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



అధికారులతో మాట్లాడుతున్న చైర్మన్

## అంతరాయం లేకుండా నీటి సరఫరా

**షాద్‌నగర్, జూన్ 17, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణ ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా నిరంతరాయంగా తాగునీరు అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ సూచించారు. బుధవారం షాద్‌నగర్ బైపాస్ వద్ద జరుగుతున్న మిషన్ భగీరథ మరమ్మత్తు పనులను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కమ్మదనం వద్ద ఉన్న మిషన్ భగీరథ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన చైర్మన్, ఈఈ కవిత, డీఈ మమత తదితర అధికారులతో సమావేశమయ్యారు. పట్టణంలో నీటి సరఫరాలో తలెత్తుతున్న సమస్యలు, పైప్‌లైన్ మరమ్మత్తులు, పంపిణీ వ్యవస్థపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్గనూర్ బసవేశ్వర్ మాట్లాడుతూ, ప్రజలకు తాగునీటి సరఫరా అత్యంత ప్రాధాన్య అంశమని అన్నారు. ఎక్కడైనా పైప్‌లైన్ లీకేజీలు, సాంకేతిక సమస్యలు తలెత్తిన వెంటనే మరమ్మతు పనులు చేపట్టి నీటి సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వేసవి కాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ ఈఈ కవిత మాట్లాడుతూ, పట్టణానికి తాగునీటి సరఫరాను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన మరమ్మత్తు పనులు వేగవంతంగా చేపడుతున్నామని తెలిపారు. ఎక్కడైనా సమస్యలు గుర్తించిన వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేసి పరిష్కరిస్తున్నామని, ప్రజలకు నిరంతరాయంగా నీటి సరఫరా అందించేందుకు శాఖ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.



## బిఆర్ఎస్ నేత బంధులాల్‌కు ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి పరామర్శ

**షాద్‌నగర్, జూన్ 17, ప్రభాతవార్త :** ఇటీవల గుండెపోటుతో హైదరాబాద్ లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొందుర్గు మండల రేగడి చికమ్రి బీఆర్ఎస్ నాయకులు మాజీ సర్పంచ్ బంధులాల్‌ను ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పరామర్శించారు. ఆసుపత్రికి వెళ్లిన ఆయన బంధులాల్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయనకు ధైర్యం చెబుతూ, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షి ంచారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డితో పాటు మాహాదేవ్ పూర్ సర్పంచ్ అనుష రవీందర్ రెడ్డి, చిలకమ్రి సర్పంచ్ శ్వేతా శివకుమార్ రెడ్డి, యువనాయకులు వీరందర్ రెడ్డి, ఓంకార్ తదితరులు పరమార్శించారు.

## ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం

**కొడంగల్ రూరల్, జూన్ 2 (ప్రభాతవార్త):** కొడంగల్ పట్టణంలోని నవీన ఆదర్శ ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల వ్యవస్థాపకులు డి.లక్ష్మి వెంకటయ్య, ప్రిన్సిపాల్ డి.వీ.నరేశ్‌రాజ్, వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ సాధనలో అమరవీరుల త్యాగాన్ని విద్యార్థులకు వివరించారు. అదే విధంగా పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న తిరుపతిరెడ్డి

## ఆలయ పనులు నాణ్యతో పూర్తిచేయాలి

**కొడంగల్, జూన్ 17 ప్రభాతవార్త :** కొడంగల్ పట్టణంలోని శ్రీమహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి దేవాలయం తెలంగాణా తిరుపతిగా పేరు గాంచనుందని, ఇందుకుగాను సీఎం రేవంత్‌రెడ్డి రూ.110 కోట్ల నిధులతో ఆలయ పునర్నిర్మాణంతో ఆలయం ఆధ్యాత్మికత సంతరించుకోనుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని బాలాజీనగర్‌లో శ్రీవారి ఆలయ పునర్నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తిరుపతి తరహాలో వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఆలయ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. శ్రీవారి ఆలయంలో కళ్యాణకట్ట, వరహస్వామి ఆలయం, అన్నదాన సత్రం తదితర అన్ని హంగులతో ఆలయం పూపుదిద్దుకోనుందని తిరుపతిరెడ్డి అన్నారు. ఆలయ పనులను నాణ్యతతో పాటు త్వరితగతిన పూర్తి చేయాలని సంభందిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, మున్సిపల్ వైస్ చైర్మేన్ శంకర్‌నాయక్, లయ ధర్మకర్తలు, నాయకులు సంజీవ్‌రెడ్డి, కేవీ రాజేందర్, కొడంగల్ నయ్యూం, దాము, బత్తుల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.